ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం, రక్తదాన కార్యక్రమాలకు విశేష స్పందన లభించింది. శిబిరాన్ని చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సేవాభావంతో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. రోగులను వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆలోచనలు ఆచరణీయం



ఘట్‌కేసర్: రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్.అంబేద్కర్ ఆలోచనలు ఆచరణీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు చిలుకూరి గణేష్ అన్నారు. ఘట్‌కేసర్ పట్టణంలో ప్రబుద్ధ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని, అందుకు అనుగుణంగానే రాజ్యాంగ రచన సాగిందన్నారు. మహనీయుల జీవిత చరిత్రలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘ ప్రతినిధులు మేకల దాస్, నర్సింగ్ రావు, తోక బాలయ్య, మీసాల రాజేష్ కుమార్, బొడ్డు నర్సింగ్‌రావు, కే.సత్యం, కృష్ణంరాజు, ఈ.విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభచాటిన విద్యార్థులు



మేడ్చల్: నగరంలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కరాటే పోటీల్లో మేడ్చల్‌కు చెందిన 369 షటోకాన్ కరాటే అకాడమి విద్యార్థులు ప్రతిభ చాటారు. అకాడమికి చెందిన విద్యార్థులు బంగారు, సిల్వర్ పతకాలు సాధించగా అకాడమి ఫౌండర్ చైర్మన్ సాయికుమార్, కోచ్‌లు విద్యార్థులను సన్మానించారు.

నీటి సమస్య పరిష్కరించాలని వినతి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న 14వ వార్డు ప్రజలు

మేడ్చల్: పట్టణంలోని 14వ వార్డులో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ వార్డు ప్రజలు మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి వినతి పత్రం సమర్పించారు. వార్డులో ఇంటింటికీ గోదావరి జలాలు సరిగా సరఫరా కావడం లేదని నిత్యం ఇంటింటికీ నీరు సరఫరా అయ్యేలా చూడాలని కోరారు.

ప్రతిభ కనబర్చిన పాలిటెక్నిక్ విద్యార్థులు



మేడ్చల్: ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన విద్యార్థుల దినోత్సవంలో మేడ్చల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, అండ్ టెలికమ్యూనికేషన్స్ రంగంలో విద్యార్థుల దినోత్సవం సందర్భంగా నిర్వహించి వివిధ పోటీల్లో విద్యార్థులు ప్రతిభచాటారు. వివిధ అంశాల్లో బహుమతులు సాధించారు. ప్రిన్సిపాల్ అరుంధతి, సీనియర్ అధ్యాపకులు వెంకట్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

మూఢ నమ్మకాలతో భవిష్యత్ నాశనం



మేడ్చల్: మూఢ నమ్మకాలతో భవిష్యత్‌ను నాశనం చేసుకోకుండా ప్రజల్లో చైతన్యం నింపాల్సిన అవసరం ఉందని మూఢ నమ్మకాల నివారణ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. మేడ్చల్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పర్యటించి అన్ని ప్రాంతాల ప్రజల్లో చైతన్యం తేవాలని అన్నారు. మండలంలో అన్ని గ్రామాలు, మండల కమిటీలను పటిష్టం చేయాలని అన్నారు. మండల నాయకులు ప్రశాంత్, మోహన్, అశ్విని, జ్యోతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో బంగారం, నగదు చోరీ

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో శుక్రవారం రాత్రి ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన దుండగులు బంగారం, నగదు దోచుకెళ్లారు. పోలీసుల వివరాల ప్రకారం ఎన్జీవోస్ కాలనీలో నివాసం ఉండే గౌరీశ్(68) తన కుమారుడు నాగేశ్‌తో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆయన శుక్రవారం మధ్యాహ్నం తను నివాసం ఉండే గది తలుపులు మూసి మూసాపేట్‌లో ఉన్న తన కూతురు వద్దకు వెళ్లాడు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులు గౌరీశ్ గదికి ఉన్న గ్రిల్ తొలగించి ఉండటం గమనించి లోపలికి వెళ్లి చూడగా గదిలో ఉన్న రెండు తులాల బంగారు రింగులు, కొంత నగదు పోయినట్లు గుర్తించి మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూడు గంటల్లో మహిళ ఆచూకీ లభ్యం

మేడ్చల్‌రూరల్: అనారోగ్య కారణాలతో ఇంట్లో నుంచి వెళ్లిపోయిన మహిళ ఆచూకీని మేడ్చల్ పోలీసులు 3 గంటల్లో కనుగొన్నారు. సీఐ నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శామీర్‌పేట్ మండలం మురహరిపల్లి గ్రామానికి చెందిన దేవరగుడి లలిత-మహేశ్ దంపతుల కూతురు మంజుల(25) వివాహం జరిగింది. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. శనివారం పుట్టింటికి వచ్చిన మంజుల ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆమె సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా కామారెడ్డిలో ఉన్నట్లు గుర్తించి 3 గంటల్లో మేడ్చల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. మహిళ ఆచూకీ కనుగొనడంలో చొరవచూపిన కానిస్టేబుల్ చందును సీఐ నర్సింహారెడ్డి, ఎస్ఐ మురళీధర్ అభినందించారు.

‘ఆట’ంకాలెన్నో..?

- కార్యాలయాల్లో మూలుగుతున్న 290 కిట్లు
- మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతోనే..
- క్రీడా ప్రాంగణాల నిర్వహణ అంతంతే..
- పట్టించుకోని అధికార యంత్రాంగం



సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు అవసరమైన సామగ్రిని అందించే లక్ష్యంతో గత ప్రభుత్వం అన్ని గ్రామ పంచాయతీల్లో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలు నిర్మించి.. గత ఏడాది సెప్టెంబరులో సామగ్రిని పంపిణీ చేసింది. నిర్వహణపై నిర్దిష్ట మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో ప్రస్తుతం ఈ క్రీడా సామగ్రి గ్రామ పంచాయతీల్లో మూలనపడి ఉంది. ప్రభుత్వం క్రీడా సామగ్రి అందజేసిన కొద్ది రోజుల్లోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో దీనిపై ఎలాంటి నిర్ణయం వెలువడకపోవడంతో ప్రస్తుతం ఐదు నెలలుగా క్రీడాకారులకు సైతం ఉపయోగపడటం లేదు. క్రీడా కిట్లో వాలీబాల్, వాలీబాల్ నెట్, క్రికెట్ కిట్, వ్యాయామం చేసే పరికరాలు, డంబెల్స్ వంటి వాటిని పంపిణీ చేశారు. ఇప్పటికే చాలాచోట్ల క్రీడల కోసమని కిట్లను తీసుకెళ్లి తిరిగి ఇవ్వకపోవడంతో గ్రామాల్లో వీటిపై పర్యవేక్షణ కొరవడింది.

బోర్డులకే పరిమితమైన క్రీడా ప్రాంగణాలు

- గత ప్రభుత్వం చేపట్టిన క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితం అవుతున్నాయి. మొదట్లో వీటి అమలుకు కొంత మేరకు నిధులు ఖర్చు చేశారు. సరిపడా స్థలం లేకపోవడంతో గ్రామాలకు దూరంగా క్రీడా ప్రాంగణాలను ఎంపిక చేశారు. పలుచోట్ల వెంచర్లు, పార్కుల ఆవరణలోనే క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. వీటిపై పర్యవేక్షణ లేకపోవడంతో ప్రస్తుతం పిచ్చిమొక్కలు పెరిగి ముళ్లచెట్లకు నిలయంగా మారుతున్నాయి.
- పురపాలికల్లో సైతం క్రీడా ప్రాంగణాలు ఉన్నప్పటికీ వీటికి సైతం నిర్వాహణ కరువైంది. వెంచర్లు, పార్కుల మైదానాలను క్రీడా ప్రాంగణాలుగా చూసి బోర్డులు పెట్టడంతో బయటి యువకులకు ఆటలకు వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికైనా క్రీడా ప్రాంగణాలు క్రీడాకారులకు అందుబాటులో ఉండేలా చూడాలి. సంబంధిత అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలు, క్రీడా సామగ్రిపై మరింత పర్యవేక్షణ పెంచి గ్రామీణ క్రీడాకారులకు అందుబాటులో ఉండేలా చూడాలి.
- ప్రస్తుతం ప్రత్యేకాధికారులను నియమించి నందున పంచాయతీ కార్యదర్శులే క్రీడా సామగ్రిని పర్యవేక్షిస్తారు. గ్రామ పంచాయతీకి వచ్చే అన్నిరకాల సామగ్రిని వారే పర్యవేక్షించాలని క్రీడాధికారులు పేర్కొంటున్నారు.

మూలుగుతున్న కిట్ల సంఖ్య 290

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని క్రీడా ప్రాంగణాలకు రెండు విడతలుగా క్రీడా సామగ్రికి సంబంధించిన క్రీడా కిట్లు 436 రాగా, ఇప్పటి వరకు 146 క్రీడా కిట్లను మాత్రమే సంబంధిత గ్రామ పంచాయతీలు, పురపాలికల్లోని క్రీడా ప్రాంగణాలకు పంపిణీ చేశారు. మిగతా 250 కిట్లు ఐదు నెలలుగా ప్రభుత్వ కార్యాలయాల్లో మూలుగుతున్నాయి. మొదటి విడతలో 186 క్రీడా కిట్లు రాగా, 146 కిట్లను మాత్రమే పంపిణీ చేసి, 40 క్రీడా కిట్లను కార్యాలయాలకు పరిమితం చేశారు. ఆ తర్వాత రెండో విడతలో భాగంగా సెప్టెంబర్‌లో జిల్లాకు చేరిన 250 క్రీడా కిట్లు అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం వల్ల పంపిణీ చేయకుండా నిలిపివేశారు.

కార్యాలయాలకే పరిమితం చేయడంతో..

- శాసనసభ ఎన్నికలు ముగియగానే క్రీడా కిట్లు పంపిణీ చేయాల్సి ఉన్నా.. కొత్త ప్రభుత్వం మార్గదర్శకాల కోసం పంపిణీ చేయకుండా.. కార్యాలయాలకే పరిమితం చేయడంతో క్రీడా ప్రాంగణాలు వెలవెలబోతున్నాయి. మళ్లీ పార్లమెంట్ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో మూలకు పడిన క్రీడాకిట్లు పంపిణీకి నోచుకుంటాయా.. లేదా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సంబంధిత అధికారులు మాత్రం ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీ కాగానే క్రీడా కిట్లు పంపిణీ చేస్తామని పేర్కొంటున్నారు.

కొరత.. కలత

- సర్కారు దవాఖానాల్లో డాక్టర్లు, సిబ్బంది కొరత
- నిత్యం ఇబ్బందులు పడుతున్న రోగులు



రోగులకు తప్పని వెతలు..

సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారుల్లో పెరిగిన జనాభా, కాలనీలకు అనుగుణంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన వైద్యులు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది, ఆశ వర్కర్ల పోస్టులను భర్తీ చేయకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మేడ్చల్ జిల్లాలో మల్కాజిగిరి కేంద్ర ఆస్పత్రితో సహా ఘట్‌కేసర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌తో పాటు 26 ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 12 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, 70 పల్లె దవాఖానాలు, 112 బస్తీ దవాఖానాలు ఉన్నాయి. అలాగే, ఐదు నెలల క్రితం మేడ్చల్, శామీర్‌పేట ప్రభుత్వ ఆస్పత్రులను కమ్యూనిటీ హెల్త్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేశారు. అప్‌గ్రేడ్ చేసిన సీహెచ్‌సీల్లో కనీస వసతులతో సహా డాక్టర్లు, సిబ్బందిని నియమించకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో 72 స్టాఫ్ నర్సులతో పాటు యూపీహెచ్‌సీలు, బస్తీ, పల్లె దవాఖానాల్లోని 26 డాక్టర్లు, నలుగురు పారా మెడికల్ సిబ్బంది పోస్టులను భర్తీ చేయకుండా ఖాళీగా ఉంచడంతో రోగుల బాధల వర్ణనాతీతం.

మేడ్చల్, ఘట్‌కేసర్ ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది కొరత రోగులపాలిట శాపంగా మారుతోంది. ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులతో సహా పల్లె, బస్తీ దవాఖానాల్లో వైద్యులు, సిబ్బంది కొరతకు తోడు.. సమయానికి రాని వైద్యాధికారులు, సిబ్బంది వైఖరితో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో 12 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా, ఇందులో 11 కేంద్రాల్లోనే ప్రసవాలు చేస్తున్నా.. డాక్టర్లు అందుబాటులో లేని కారణంగా గర్భిణులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. 26 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా, ఇందులో ఆరింటిలో ప్రసవాలు చేస్తున్నామని జిల్లా వైద్యారోగ్యశాఖ చెబుతున్నా.. ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు. కొత్త ప్రభుత్వం ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మేడ్చల్ సబ్ స్టేషన్ పరిధిలోని సూర్యనగర్ ఫీడర్‌లో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా సోమవారం పట్టణంలోని పలు కాలనీల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. పట్టణ పరిధిలోని సూర్యనగర్, ఆర్టీసీ కాలనీ, మల్లికార్జుననగర్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు.

మేడ్చల్ ఎంపీడీఓ బదిలీ

మేడ్చల్: ఎన్నికల బదిలీల్లో భాగంగా మేడ్చల్ ఎంపీడీఓ పద్మావతి బదిలీ అయ్యారు. రెండేళ్లుగా ఎంపీడీఓగా పనిచేస్తున్న పద్మావతిని రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేస్తున్నట్లు పంచాయతీ రాజ్ శాఖా కమిషనర్ అనితా రామచంద్రన్ ప్రకటన విడుదల చేశారు.

మజీద్‌పూర్‌లో స్వచ్ఛ్ భారత్



శామీర్‌పేట్: మజీద్‌పూర్ గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ్ భారత నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని పోచమ్మ ఆలయ పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు, ముళ్ల కంచెల తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు తుంకి చిన్న, వికాస్, శ్రీకాంత్, రామకృష్ణ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



ఘట్‌కేసర్: చౌదరిగూడ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 869 ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను మండల అధికారులు ఆదివారం జేసీబీ సహాయంతో కూల్చివేశారు. ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, ప్రత్యేక అధికారి పద్మజా రాణి ఆదేశాల మేరకు గ్రామ కార్యదర్శి శశికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది కూల్చివేతలు చేపట్టారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

ఎల్ఐజీలో సమస్యల పరిష్కారానికి కృషి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఎల్ఐజీ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కాలనీ కో ఆపరేటివ్ సొసైటీ ప్రతినిధి రామాంజనేయులు తెలిపారు. ఇందులో భాగంగా ఏ4 బ్లాక్ వద్ద ఏర్పడిన డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కాలనీ వాసుల సహకారంతో సొసైటీని మరింత బలోపేతం చేసి, సమర్థవంతంగా పనిచేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా..



స్నేహితుడి కుటుంబానికి సాయం అందజేస్తున్న తోటి మిత్రులు

మేడ్చల్: 1991లో తమతో పాటు పదో తరగతి వరకు చదువుకున్న చిన్ననాటి స్నేహితుడు అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబానికి ఆయన మిత్రులు అండగా నిలిచారు. మేడ్చల్ జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో 1991వరకు చదువుకున్న కుమార్ అనారోగ్యంతో ఇటీవలె మరణించాడు. ఆయన పదవ తరగతి బ్యాచ్ స్నేహితులు కుమార్ ఇంటి వెళ్లి రూ.20 వేల వరకు ఆర్థిక సాయం చేసి వారి పిల్లల చదువుకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఆటోబంద్ పోస్టర్ ఆవిష్కరణ



మేడ్చల్: ఈ నెల 16న నిర్వహిస్తున్న ఆటో బంద్ కార్యక్రమ పోస్టర్లను మేడ్చల్ ఆటో డ్రైవర్లు ఆవిష్కరించారు. ఆటో స్టాండ్ వద్ద ఆటో యూనియన్ నాయకులతో కలిసి డ్రైవర్లు ఆటో బంద్ పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఆటోవాలాల పరిస్థితి దీనంగా మారిందని, ఒక రోజు బంద్‌లో అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు విజయారావు, వెంకటేష్, మహేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష విలువ చేసే మద్యం లభ్యం



ఘట్‌కేసర్: రాచకొండ సీపీ ఆదేశం మేరకు ఘట్‌కేసర్ పోలీసులు ఆదివారం తెలవారు జామున ఆర్ఓఆర్ఆర్ ఎగ్జిట్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఓ కారులో మధ్యప్రదేశ్ నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం లభించింది. బారుపాటి జగన్ మోహన్(51) రామన్నపేట్ వరంగల్, మేరెడ్డి ప్రశాంత్‌రెడ్డి(28) వనపర్తి జిల్లా వాసులుగా తేలింది. మధ్యప్రదేశ్‌లోని కోలాపూర్ నుంచి అనుమతి లేకుండా సిగ్నిచర్ బాటిల్స్ 84, రాయల్ స్టాగ్ బాటిళ్లు 12, ఆఫీసర్ ఛాయిస్ బాటిళ్లు 96తో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. మద్యం విలువ రూ.లక్షగా తేలింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అడిషనల్ డీసీపీ ప్రసాదరావు, ఉప్పల్ మహిళా పీఎస్సై మంజుల, ఘట్‌కేసర్ పోలీసులు ఉన్నారు.

గృహజ్యోతి పత్రాల స్వీకరణ

గౌతంనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశంపెట్టిన గృహజ్యోతి కార్యక్రమాన్ని విద్యుత్ ఏడీఈ యాదగిరి ఆదివారం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానెహ్రూనగర్‌లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీల్లో భాగంగా స్థానిక కమ్యూనిటీ హాల్‌లో గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించామన్నారు. 200 వరకు కరెంట్ యూనిట్‌లను వాడుకున్న వారికి బిల్లులు సవరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కన్నెమళ్ల నాగరాజు, వైనాల ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

కార్మికులకు అండగా బీఆర్ఎస్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

మేడ్చల్: రాష్ట్రంలోని అన్ని రంగాల కార్మికులకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్‌లోని షీలా ఫోం ఎంప్లాయిస్ యూనియన్ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాము అధికారంలో ఉన్న సమయంలో ప్రస్తుతం కార్మికుల పక్షపాతిగా ఉన్నామని కార్మికులకు ఎలాంటి సమస్య వచ్చినా ముందుండి పోరాటం చేసి పరిష్కరిస్తామని అన్నారు. షీలా కంపెనీ కార్మికులకు వేతనాలు పెంచడంలో యూనియన్ చేసిన ప్రయత్నాలు అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, మేడ్చల్ కౌన్సిలర్ మణికంఠ, నాయకులు చారి, సత్యనారాయణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రియల్టర్లకు వత్తాసు పలుకుతున్న పోలీసులు



మాట్లాడుతున్న బాధితులు

మేడ్చల్: మేడ్చల్ మండలం శివారులో ఉన్న మైసిరెడ్డిపల్లి గుమ్మడిదల ప్రాంతంలోని అసైన్డ్ భూముల వివాదంలో మేడ్చల్ పోలీసులు తలదూర్చి రియల్టర్లకు వత్తాసు పలుకుతూ పట్టాదారులకు మోసం చేస్తున్నారని బాధితులు మేడ్చల్‌లో విలేకరులతో తమ గోడును వెల్లబోసుకున్నారు. మండల శివారుల్లో కానుకుంట మండల గుమ్మడిదలకు చెందిన తీగల లక్ష్మీ, తీగల కృష్ణ, తీగల నర్సింహకు సర్వే నంబర్ 557/34/2లో ముగ్గురికి 9గుంటల చొప్పున భూమి ఉంది. ఈ భూమి అసైన్డ్ భూమి కాగా రైతులకు రియల్టర్ శ్రీనివాస్, క్రాంతి కిరణ్‌లకు వివాదం తలెత్తింది. భూమి ఉన్న ప్రాంతం కానుకుంట మండలం, గుమ్మడిదల పరిధిలో ఉంది. శివారు కావడంతో పోలీసులు అనవసరంగా జోక్యం చేసుకుని తమకు అన్యాయం చేస్తున్నారని వారు తెలిపారు. మేడ్చల్ పోలీసులు రియల్టర్లతో కుమ్మక్కై తమ భూమిని అన్యాక్రాంతం చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు తమ న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



యాడారంలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ నరసింహారెడ్డి

శామీర్‌పేట్: నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని మేడ్చల్ సీఐ నరసింహారెడ్డి అన్నారు. శామీర్‌పేట మండలం యాడారం గ్రామంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, కేసులను ఛేదించేందుకు కెమెరాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ యెల్లుబాయి, మాజీ సర్పంచ్ యాంజాల సుజాత, పంచాయతీ కర్యాదర్శి ప్రమీలదేవి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మూన్నురు కాపు సంఘం నూతన కార్యవర్గం



మేడ్చల్: మేడ్చల్ మండల, పట్టణ మూన్నురు కాపు కుల నూతన కార్యవర్గాన్ని మేడ్చల్‌లో ఎన్నుకున్నారు. పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కులస్తులు పాల్గొని కుల అభ్యున్నతి కోసం సంఘటిత పోరాటం చేయాలని కోరారు. అధ్యక్షుడిగా ఆకుల సురేష్ పటేల్(బండమాదారం), ప్రధాన కార్యదర్శిగా బాలగిరి పాండు(రాజబోల్లారం), సలహాదారులుగా ఈశ్వరయ్య, పాండు, సహాయ కార్యదర్శులుగా విష్ణు(గౌడవెల్లి), కె.వెంకటేష్(అత్వెల్లి), కోశాధికారిగా గర్దాస్ నరేందర్, కార్యనిర్వహక కార్యదర్శిగా దాత మల్లేష్, యూత్ అధ్యక్షుడిగా నాగుల రాజేష్, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు(గుండ్లపోచంపల్లి), ఉపాధ్యక్షులుగా సంతోష్(మైసిరెడ్డిపల్లి), మండల బుజంగం (అత్వెల్లి)లను ఎన్నుకున్నారు.

పట్టణ కమిటీ..

పట్టణ అధ్యక్షుడిగా పూర్ణచందర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తోట రాజు, ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా రాంగోపాల్, కోశాధికారిగా మండల మురళీధర్, ఉపాధ్యక్షులుగా నాగరాజు, సురేష్ కార్యదర్శులుగా తిరుమలేష్, మహేష్, రఘురాం, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో కుల సంఘం నాయకులు వినోద్‌కుమార్, ప్రకాష్, విష్ణుజగతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందాలి



వైద్య శిబిరంలో కాలనీవాసులు

బోడుప్పల్: సమాజంలో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందాలని బోడుప్పల్ 19వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బొమ్మక్ శ్రీనివాస్ అన్నారు. 19వ డివిజన్ ఈస్ట్ బృందావన్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం విజయ దయాగ్నస్టిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికీ అన్ని రకాల వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం, పాలకులపై ఉందన్నారు. నేటికీ సమాజంలో కొందరికి సరైన వైద్యం అందడం లేదన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు బీకే నాయక్, సత్యనారాయణ, అశోక్‌రెడ్డి, రమేష్‌బాబు, హనుమంత్‌రావు, నారాయణరెడ్డి, శివ, సానియల్ శ్రావణ్‌యాదవ్, కరుణాకర్, అంజిరెడ్డి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

బోడుప్పల్: దేశవ్యాప్తంగా ఈనెల 16వ తేదీన జరిగే కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నందూరి కరుణకుమారి అన్నారు. బోడుప్పల్ ఇందిరానగర్ కాలనీలో ఆదివారం ఏఐటీయూసీ మండల కార్యదర్శి దండు రమేష్ ఆధ్వర్యంలో ఆవిష్కరించిన వాల్ పోస్టర్‌ను ఆమె ప్రారంభించారు.ఆమె మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మికులు సాధించుకున్న 44 రకాల చట్టాలను 4 కోడ్‌లుగా చేసి కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్, భూతం ఐలయ్య, ఎండీ అన్వర్, మాచర్ల కనకయ్య, ఇస్తారి, సోమరాజు, రాంచందర్, వెంకటమ్మ, లక్ష్మి, మణెమ్మ, సుజాత, రమేష్, రజిత ఉన్నారు.

శాంతి భద్రతల్లో సీసీ కెమెరాల పాత్ర కీలకం



బోడుప్పల్: సీసీ కెమెరాలు శాంతి భద్రతలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని 16వ డివిజన్ పీఎస్ఆర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలను అరికట్టడంలో, నేరస్తులను త్వరితగతిన గుర్తించి వారికి శిక్షపడేందుకు సీసీ కెమెరాలు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. కాలనీవాసులు తమ ఇళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం కాలనీవాసులకు సీసీ కెమెరాల ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ శివకుమార్, 16వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ దిలీప్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.